క్లుప్తంగా

రీ సర్వేపై ర్యాలీ



మానేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

లేపాక్షి: మండలంలోని మానేపల్లిలో జరిగే రీ సర్వే ప్రారంభోత్సంపై రెవెన్యూ సిబ్బంది గ్రామస్తులతో కలసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సౌజన్యలక్ష్మి మాట్లాడుతూ భూముల రీ సర్వే చేయడం వలన కలిగే ప్రయోజనాలు, ఉపయోగాలను రైతులకు వివరించారు. అలాగే గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై స్థానికులు అర్జీలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ కులాల సర్వేపై అభ్యంతరాలుంటే చెప్పండి

రొద్దం: షెడ్యూల్ కులాల సర్వేలో భాగంగా ఎవరికైనా సర్వేపై అభ్యంతరాలుంటే ఈ నెల 12 వరకూ తెలియజేవచ్చని ఎంపీడీఓ రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులకు అభ్యంతరాలను తెలియజేవచ్చని సూచించారు. షెడ్యూల్ కులాల సర్వే రిపోర్టులో ఎవరైనా పేర్లు తప్పుగా నమోదు అయింటే సంబంధిత వ్యక్తి అభ్యంతరం తెలపాలన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలని నిరసన



పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

లేపాక్షి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు. మండల కార్యదర్శి నందీష్ మాట్లాడుతూ పాఠశాల ముందే జాతీయ రహదారి ఉందని, అతి వేగంగా వాహనాలు వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు వెంటనే స్పీడ్ బ్రేకర్లు వేయాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎంపిక

సోమందేపల్లి: నాయీ బ్రాహ్మణ సంఘం మండల నూతన కమిటీను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఆ సంఘం నాయకులు సమావేశమయ్యారు. మండలాధ్యక్షుడిగా మనోహర్, ఉపాధ్యక్షుడిగా నరసింహమూర్తి, కోశాధికారిగా కృష్ణమూర్తి, కార్యదర్శిగా అరవింద్, సంయుక్త కార్యదర్శిగా మనోజ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కుల సంఘం పెద్దలు బాబయ్య, కుళ్లాయప్ప, నారాయణస్వామి, వెంకటేష్, శ్రీనివాసులు, సంజీవనాయుడు, అశ్వర్థప్ప, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోజూ ఆదాయం వచ్చేలా పంటల సాగు



రైతులకు అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ రమేష్

గుడిబండ: ఏటీఎం మోడల్ వ్యవసాయ పద్ధతుల ద్వారా సంవత్సరంలో 365 రోజులు ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ రమేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చిగతుర్పికి చెందిన రైతులతో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు పద్ధతులపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర పంటల సాగు వల్ల ప్రధాన పంటకు అయ్యే ఖర్చులను రాబట్టుకోవచ్చన్నారు. 20 సెంట్ల భూమిలో 30 రకాల ఆకుకూరలు, కూరగాయలు, పూలు, పండ్లు తదితర పంటలను సాగు చేసి ప్రతి రోజూ మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ హనుమంతరాయప్ప, ఎల్‌సీఆర్‌పీ లలితమ్మ రైతులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

మడకశిరరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం వడ్డించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించాలని డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనరసింహ నిర్వాహకులకు తెలిపారు. మంగళవారం ఉపార్లపల్లి పాఠశాలను సందర్శించి భోజన పథకం అమలు తీరు, నాణ్యతను అడిగి తెలుసుకున్నారు.

రొళ్ల: విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం విద్యార్థులకు వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. ఆయన మంగళవారం రత్నగిరి గొల్లహట్టి పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

ఉచితం మాటున దోపిడీ!

- పెన్నానదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- రాత్రీపగలు తేడాలేకుండా ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు



ఇసుక తవ్వకాల వల్ల పెన్నానదిలో ఏర్పడిన గుంతలు



రొద్దం: ఇసుక తవ్వకాలతో బయటపడిన ఫిల్టర్ బోరు

రొద్దం: పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి ఉచితం మాటున ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమ సంపాదనే ధ్యేయంగా కొందరు ట్రాక్టర్ యజమానులు ప్రకృతి వనరులను దోచేస్తున్నారు. రొద్దం మండలంలో పెన్నానది నుంచి రాత్రీ పగలు తేడా లేకుండా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు తమకేమీ తెలీనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

ట్రాక్టర్ యజమానులతో ఒప్పందం

పెన్నానది నుంచి రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా అధికంగా జరుగుతోందని నదీతీర గ్రామస్తులు చెబుతున్నారు. ప్రతి గ్రామ తీరం నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలుతోందని రైతులు వాపోతున్నారు. నియోజకవర్గానికి చెందిన ఓ వ్యక్తి .. ట్రాక్టర్ యజమానులతో ఒప్పందం చేసుకొని రాత్రి సమయంలో జేసీబీల సాయంతో ఇసుక తవ్వకాలు చేస్తున్నట్లు తెలిసింది. ట్రిప్పుకు ఇంత మొత్తం అని మాట్లాడుకొని నెలవారీ పేమెంట్లు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇసుకను కూడా ఓ చోట డంప్ చేస్తూ కర్ణాటక, ఇతర ప్రాంతాలకు తరలిస్తునట్లు సమాచారం.

పట్టించుకోని అధికారులు

రొద్దం మండల వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా ఎవరూ స్పందించడం లేదని రైతులు చెబుతున్నారు.

భూగర్భ జలాలకు ముప్పు

ఇసుక తవ్వకాలు అధికంగా ఉండడంతో పెన్నానదిలో ఫిల్టర్ బోర్లు వేసుకుని వ్యవసాయంపై ఆధారపడిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇసుక తరలిపోతే వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోయే పరిస్థితి వస్తుందంటున్నారు. రైతుల బోర్ల వద్ద కూడా ఇసుక తవ్వకాలు జరపడంతో బోర్లుకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తరలించకూడదని అడ్డగిస్తే తమపై ఇసుకాసురులు దౌర్జన్యం చేస్తున్నారని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇసుక అక్రమ రవాణా ఖారీగా సాగుతోందని, అన్ని ప్రాంతాల్లో ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారని చెబుతున్నారు. ఇసుక రవాణా ఇలాగే సాగితే వ్యవసాయ బోర్లలలో భూగర్భ జలాలు అడుగంటి మండల వ్యాప్తంగా తాగునీటి కూడా సమస్య ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. పెన్నానదిలో ఎక్కడపడితే అక్కడ ఇసుక కోసం తవ్వకాలు చేపట్టడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోండి



పెన్నానదిలో ఫిల్టర్ బోరు వేసుకుని పొలంలో పంటలు సాగు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. అయితే మా బోరు వద్ద ఇసుక తవ్వకాలు చేపట్టడంతో ఫిల్టర్ బోరు బయట పడింది. తమ బోరు వద్ద ఇసుక తవ్వకాలు చేయొద్దని చెప్పినా వారు వినడం లేదు. బోరు తేలిపోతే నీరు రాక సాగు చేసిన పంట ఎండిపోతుంది. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణాకు అధికారులు చెక్ పెట్టాలి. – రామాంజినేయులు, రైతు, రొద్దం

ఇష్టానుసారం తవ్వితే చర్యలు



మండల కేంద్రాన్ని అనుకుని ఉన్న పెన్నానది నుంచి ఇసుక అక్రమ తవ్వకాలపై దృష్టి సారిస్తాం. నదిలో నిర్ధారించిన ప్రాంతంలో అవసరాలకు ఉచితంగా ఇసుక తవ్వుకునేందుకు అనుమతించాం. నిర్దేశిత ప్రాంతంలో కాకుండా ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడితే ఊరుకునేది లేదు. ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా పెట్టాలని స్థానిక రెవెన్యూ సిబ్బందిని ఆదేశిస్తాం. – నాగేంద్ర , తహసీల్దార్, రొద్దం

పెనుకొండ కమిషనర్‌గా సతీష్‌కుమార్

అనంతపురం కార్పొరేషన్: పెనుకొండ నగర పంచాయతీ కమిషనర్‌గా సతీష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సతీష్‌కుమార్ ప్రస్తుతం నగర పాలక సంస్థలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పెనుకొండ కమిషనర్ సెలవులో వెళ్లడంతో ఈయన్ను పెనుకొండకు బదిలీ చేశారు.

వేమన పద్యాల పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అనంతపురానికి చెందిన వేమన ఫౌండేషన్ సౌజన్యంతో వేమన పద్యాల పోటీలను నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభ మాట్లాడుతూ వేమన పద్యం రాని వారు, వానకు తడవని వారు లేరని ఒక నానుడని ఉందన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడిగా ఫక్రుద్దీన్‌సాబ్

పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు గోరంట్ల మండలం పాలసముద్రానికి చెందిన టి.ఫక్రుద్దీన్‌సాబ్‌ను జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది.

విలేకరిపై దాడి హేయం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక గడినాడు మిత్ర వార పత్రిక ఎడిటర్ రామాంజినప్పపై జరిగిన దాడికి నిరసనగా స్థానిక విలేకరులు, కురుబ సంఘం నాయకులు మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అనంతరం తాలూకా కార్యాలయాన్ని ముట్టడించి వెంటనే నిందితులను అరెస్ట్ చేసి న్యాయం జరిపించాలని తహసీల్దార్ వరదరాజుకు వినతిపత్రం ఇచ్చారు. స్థానిక టోల్‌గేట్ వద్ద ఉన్న రామాంజినప్పపై సోమవారం సాయంత్రం ఇద్దరు మహిళలు దాడి చేయడం దారుణమన్నారు. తుమకూరు పాత్రికేయుల సంఘం సైతం ఆందోళనకు దిగింది. ఇదిలా ఉండగా దాడి ఘటనలో ప్రధాన నిందితుడు నారాయణరెడ్డి, ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్ట్ చేశారు.

పరీక్ష గది మరమ్మతుకు హామీ



ఉపాధ్యాయులతో చైర్మన్ కరణం రమానందన్

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్న పరీక్ష తరగతి గదికి మరమ్మతు చేయిస్తానని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు శిథిలావస్థకు చేరిన గది గురించి తెలియజేయగా.. వెంటనే పరీక్ష గదికి మరమ్మతు చేస్తామని హామీ ఇచ్చారు.

నేటి నుంచి ఉచిత వైద్య శిబిరం

పెనుకొండ: ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ సాయి కాశేశ్వర్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని శివసాయి మందిరం ఆవరణలో బుధవారం నుంచి 5 రోజుల పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. చెవి, ముక్కు, గొంతు ఆరోగ్య సమస్యలు, చర్మ వ్యాధులు, పంటి నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, వినికిడి సమస్యలున్న వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి పరికరాలు అందిస్తామన్నారు. వినికిడి లోపం ఉన్న వారు ఆధార్ జిరాక్స్, తెల్లరేషన్ కార్డు జిరాక్స్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలని సూచించారు.

హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ఆందోళన వద్దు

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి

మడకశిరరూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ముందు జాగ్రత్తగా హ్యూమన్ మోటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ)పై ముందు జాగ్రత్తగా ప్రజలు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆమె నీలకంఠాపురం పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో మాట్లాడారు. హెచ్‌ఎంపీవీ వైరస్, బాల్య వివాహాల నిర్మూలన, 70 ఏళ్లు పైబడిన వారికి పీఎంఏజేవై కార్డులు, సీజనల్ వ్యాధులపై పలు సూచనలు, సలహాలిచ్చారు. హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే ముందు జాగ్రత్తగా ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. జ్వరం, తగ్గు, గొంతు నొప్పి,జలుబు తదితర వ్యాధి లక్షణాలు ఉంటే వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయవర్ధన్ రెడ్డి, ఫార్మసిస్ట్ కాంతరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



రొళ్ల: మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి

మడకశిరరూరల్: మండలంలో గ్రామస్థాయిలో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనరసింహ తెలిపారు. మంగళవారం ఉపార్లపల్లిలోని పాఠశాలలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించి నాలుగు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కరియన్న, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రొళ్ల: రైతులు గ్రామసభ ద్వారా భూసమస్యలను పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కాకి సచివాలయ ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలపై రైతులు అర్జీలు ఇస్తే వాటిని పరిశీలించి అర్హులకు న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ సమస్యలపై 14 అర్జీలు రైతుల నుంచి స్వీకరించామని చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ, ఆర్ఐ గిరియప్ప తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



అగళి: యూటీఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అగళి: మండల కేంద్రంలోని విద్యాశాఖాధికారి కార్యాలయంలో యూటీఎఫ్ నూతన క్యాలెండర్ ,వాల్ పోస్టర్లను ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు మంగళవారం ఆవిష్కరించారు. పాఠశాలల్లో సమస్యలు లేకుండా చూసుకుని ఉత్తమ విద్యాబోధన చేయాలని ఎంఈఓ సూచించారు. మండల అధ్యక్షుడు ఎంఎస్ ప్రభురాజు, ప్రధాన కార్యదర్శి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎస్టీఏ క్యాలెండర్..

రొద్దం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంఈఓ-2 విజయభాస్కర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, సరెండర్ లీవ్ మొత్తాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీఏ నాయకులు శంకర, ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా నమోస్తుతే !



అలంకరణలో సప్తఫణి సుబ్రహ్మణ్యస్వామి

హిందూపురం: పుష్య అష్టమి మంగళవారం సందర్భంగా స్థానిక శ్రీనివాసనగర్‌లోని సప్తఫణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆలయ ఆవరణంలోని నాగుల విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

బాల్య వివాహాలను అరికడదాం



రొళ్ల: శిక్షణ ఇస్తున్న సీడీపీఓ నాగమల్లేశ్వరి



పరిగి: మాట్లాడుతున్న ఎస్ఐ రంగడుయాదవ్

రొళ్ల: బాల్య వివాహాలు జరగకుండా సమూలంగా అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని సీడీపీఓ నాగమల్లేశ్వరి సూచించారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో 'కిశోరి వికాసం' పై అంగనవాడీ వర్కర్లు, సచివాలయాల మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు చేయాలని ప్రయత్నిస్తుంటే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1098, 100 సమాచారం ఇవ్వాలన్నారు.

పరిగి: ఆపద సమయాలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలని ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కిశోర బాలికకు కరాటే వంటి శిక్షణ, డిజిటల్ భద్రత, సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ వేదికల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి, డాక్టర్ నవీన, ఏఓ అశ్వర్థప్ప, ఏపీఎం రామేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమర యోధుడిని కలిసిన మాజీ మంత్రి



వీఎస్ రెడ్డిని సన్మానించిన మాజీ మంత్రి వెంకటరమణప్ప

పావగడ: తాలూకాలోని వెంకటాపురం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు, శతాధిక వృద్ధుడు వీఎస్ రెడ్డి (103)ని మాజీ మంత్రి వెంకటరమణప్ప కలసి ఘనంగా సన్మానించారు. ఆయన మంగళవారం వీఎస్ రెడ్డి గృహానికి వెళ్లి పరామర్శించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ వీఎస్ రెడ్డి లాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని అనేక పోరాటాలు చేశాడని, జైలుకు వెళ్లారన్నారు.

ప్లాస్టిక్ పూల మాలల తయారీపై శిక్షణ

హిందూపురం: ప్లాస్టిక్ పూలతో మాలలు తమారు చేసే విధానంపై సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోళాపురం గ్రామంలో మంగళవారం హ్యాండీక్రాఫ్ట్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ట్రైనర్ ఆనంద్ వివిధ రకరకాల ప్లాస్టిక్ పూల హారాలు తయారు చేసి చూపించారు. గ్రామంలో 15 మంది మహిళలు పూల హారాల తయారీపై శిక్షణ తీసుకున్నారు. ఆనంద్ మాట్లాడుతూ మహిళలు ఇంటి వద్దనే ఉంటూ రకరకాల ప్లాస్టిక్ పూలు సిద్ధం చేయడం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చన్నారు.

పైకప్పు మరమ్మతుకు చర్యలు



ఎంపీడీఓ కార్యాలయ పైకప్పును పరిశీలిస్తున్న అధికారులు

అమరాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనం పైకప్పు మరమ్మతుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎంపీపీ ఈరన్న సూచన మేరకు మంగళవారం డిప్యూటీ డీఈ వెంకటేశ్వర్లు దెబ్బతిన్న భవనం పై కప్పు పరిశీలించారు. పైకప్పు మరమ్మతుకు ఎస్టిమేషన్ తయారు చేస్తామన్నారు.

తాగునీరు వృథా



మడకశిర: పట్టణంలో మధుగిరి రోడ్డులో ఉన్న మారుతీనగర్ ప్రధాన రోడ్డు పక్కన తాగునీటి పైప్ లైన్ దెబ్బతింది. దీంతో తాగునీరు వృథా అవుతోంది. కొన్ని రోజుల నుంచి నీరు వృథాగా పోతున్నా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

సామాజిక తనిఖీపై రేపు బహిరంగ సభ

రొళ్ల: మండల కేంద్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం 18వ విడత సామాజిక తనిఖీపై బహిరంగా సభను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావు ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీలో వెల్లడైన అంశాలను బహిరంగ సభ ద్వారా విజిలెన్స్, డ్వామా అధికారుల ఎదుట డీఆర్పీలు చదివి వినిపిస్తారన్నారు.

10న మండల మీట్

మడకశిర: మడకశిర మండల సర్వసభ్య సమావేశం ఈనెల 10న ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ సోనిబాయి, ఎంపీపీ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

ఆర్థిక పరిపుష్టి సాధించాలి

పావగడ: శివా సాగు భూముల్ని సకాలంలో సాగు చేసుకోవాలని, పంటలు పండించి ఆర్థిక ఎదగాలని ఎమ్మెల్యే వెంకటేశ్ సూచించారు. స్థానిక తాలూకా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన శివా సాగు సమితి సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులకు హక్కు పత్రాలను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరదరాజు, సమితి సభ్యులు సునీత మంజునాథ్, మారన్న, చిక్కన్న, రవి, ఆర్ఐ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.